11

# ధర్మశాస్త్ర నెరవేర్పు

## (5:17-20)

మెస్సీయ నిరీక్షింపబడినాడు మరియు ఎదురుచూడబడినాడు, కానీ ఆయన ఎలా ఉంటాడో పామర ప్రజలకు అర్థంకాలేదు. ఆయన యొక్క సాహసోపేతమైన మరియు సాధికారమైన బోధనలు దేవుడిచ్చిన ధర్మశాస్త్రమునకు పరస్పరము విరుద్ధమైనవిగా లేక తిరస్కరింపబడుచున్నవిగా దృష్టింపబడినవి. సహజంగానే, ఇంతకు మించి సత్యదూరమైనది మరేదియును లేదు, ఏలయనగా యేసు తానే స్వయంగా ఆ విషయాన్ని ఈ వచనములలో వివరించాడు. ఈ విభాగము (5:17-20) కొండ మీద ప్రసంగములోని ప్రధాన భాగమును మొదలుపెట్టుచున్నది (5:17-7:12). అది ఈ అధ్యాయములోని శేష భాగమును అపేక్షించుచున్నది (5:21-48), అచ్చట యేసు అల్పబుద్ధితో కూడిన ఆలోచనలలో నుండి గాని తప్పుడు ఆలోచనలలో నుండి గాని తలెత్తుచు సర్వసామాన్యముగా సమ్మతింపబడిన ధర్మశాస్త్రానువాదములను సరిదిద్దాడు.

### "కొట్టివేయుటకు రాలేదు" (5:17)

**[17]ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు.**

**వచనము 17. తలంచవద్దు** అను మాట అపార్థమును సరిదిద్దుటలో యేసు కలిగియుండిన గురిని గూర్చిన సంకేతములను తెలియజేయుచున్నది (10:34 చూడుము). అది "మీకు సంపూర్ణ సమాచారము తెలియకుండుట మాకిష్టములేదు" అని పౌలు తన పత్రికలలో రాసిన పదజాలము వంటిదై యున్నది (రోమీయులకు 11:25; 1 థెస్సలొనీకయులకు 4:13). ఆయన **ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయుటకు** ప్రయత్నించుట లేదని యేసు తన శ్రోతలకు అభయమిచ్చాడు. ఆంగ్లములో నున్న పరిశుద్ధ సత్యవేదములలోని ధర్మశాస్త్రము అను సమానార్థమిచ్చు పదము "Law" ("లా") దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలు జనులకిచ్చిన ఆజ్ఞలను మరియు కట్టడలను సూచించుచున్నది అనువాదకులు సర్వసామాన్యంగ అర్థంచేసికొన్నారని అర్థమగుచున్నది.[1] మోషేకివ్వబడిన ధర్మశాస్త్రము దేవుడు తానేర్పరచుకొనిన జనాంగమునకు ఇవ్వబడినది, అది అన్యజనులకు ఇవ్వబడలేదు. అందులో అబ్రాహాము వంశస్థులందురును, ఇష్మాయేలు వంటి వారు, చేర్చబడలేదు.

యూదుడై యుండి, ఇస్సాకు ద్వారా అబ్రాహాము సంతానమై యుండి, యేసు క్రీస్తు మోషే ధర్మశాస్త్రము క్రింద జీవించాడు మరియు ధర్మశాస్త్రము క్రింద మరణించాడు. ధర్మశాస్త్రమును ఎప్పుడైనా గాని పరిపూర్ణముగా పాటించినవాడు యేసు ఒక్కడే (హెబ్రీయులకు 4:15; 5:8, 9). ఆయన ధర్మశాస్త్రమును బహు గొప్పగా గౌరవించుచుండెను, గనుక ఆయన దానిని ఎన్నడైనను అప్రతిష్ఠపాలుజేసినట్లు మనము కనుగొనము. లేక అలా చేసినట్లు అగుపించినా,

అది ధర్మశాస్త్రమునే కాదు, కానీ నానా విధములైన యూదీయ బోధకులు మరియు విద్వాంసుల ద్వారా అది అవినీతి పాలుజేయబడుచు అప్రతిష్ఠకు గురైనప్పుడు ఆయన వారిని ఖండించుట గూర్చినది మాత్రమే ఔతుంది. కేవలము ధర్మశాస్త్రమును పాటించినంతమాత్రాన అది ఇశ్రాయేలు జనాంగమును నీతిమంతులుగా తీర్చదు; వారు విధేయతగల హృదయములతో ధర్మశాస్త్రమునకు లోబడుట ద్వారా దానిని గౌరవించవలసి యుండినది (రోమీయులకు 2:13–16, 25–29; 3:20 చూడుము).

మానవాళి పతనమైనందునుబట్టి ధర్మశాస్త్రము త్వరపడి సృష్టింపబడిన ఒక ప్రత్యామ్నాయము కాదు. అది ఎల్లప్పుడు దేవుని విమోచనా ప్రణాళికలోని భాగమై యుండినది. దైవికమైన ఉద్దేశము నెరవేరు నిమిత్తము అది ఇశ్రాయేలుకు ఇవ్వబడినది. "ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞ కూడ పరిశుద్ధమైనదియు నీతిగలదియు ఉత్తమమైనదియునై యున్నదని" రోమీయులకు తెలియజేయుచు, అది "ఆత్మ సంబంధమైనదనియు" పౌలు చెప్పాడు (రోమీయులకు 7:12, 14). "మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు, ధర్మశాస్త్రము బాలశిక్షకుడాయెనని" పౌలు గలతీయ సంఘమునకు రచించాడు (గలతీయులకు 3:24). కాబట్టి, ధర్మశాస్త్రము, దేవుని ఉద్దేశమునకు వ్యతిరేకమైనది కాదు. మానవులు వారి పాపముల నుండి తమ్మునుతాము రక్షించుకొనలేరు గనుక వారు క్రీస్తు నొద్దకు నడిపింపబడవలసి యున్నదని నిరూపించుటకే అది ఇవ్వబడినది (రోమీయులకు 7:7–11; 8:3, 4; గలతీయులకు 3:22–29).

ఏదిఏమైనా, యథార్థమైన విమోచనార్థము ధర్మశాస్త్రము ఒక మూలాధారమై యుండవలెనని ఎన్నడును ఉద్దేశింపబడలేదు (గలతీయులకు 3:21). ప్రజలు ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా పాటించియుండినట్లయితే, వారు దాని చేత రక్షింపబడియుందురు – కానీ వారు దానిని పరిపూర్ణముగా పాటించలేరని దేవుడు ముందుగానే ఎరిగి యుండెను. సమస్య అంతా ధర్మశాస్త్రముకు సంబంధించినది కాదు, కానీ దాని ద్వారా కోరబడుచున్న నీతిమంతమైన కట్టడల ననుసరించి జీవించగలుగుటకు మానవునిలో ఉండిన అసమర్థత లేక వాడు చూపిన అనిష్టమే సమస్యయై యుండినది (రోమీయులకు 7:14–25).

మన నిమిత్తము మనకై మనము చేసికొనలేకపోయిన దానిని – ధర్మశాస్త్ర ప్రకారము పరిపూర్ణముగా జీవించుట – ఆయన కుమారుడు మన కొరకు చేయునట్లు దేవుడు ఆయనను పంపించాడు (2 కొరింథీయులకు 5:21 చూడుము). యేసు మన పాపములకు సంపూర్ణమైన బల్యర్పణయై యుండుటకు కూడ ఆయన వచ్చాడు (రోమీయులకు 5:12–21; హెబ్రీయులకు 10:5–10; 1 పేతురు 2:21–25). ఆయన తానే ధర్మశాస్త్రము కోరిన దాని చొప్పున జీవించుట మాత్రమే కాదు; కానీ, ఈ వాక్యభాగములో తెలియజెప్పబడుచున్నట్లుగా, వారు ధర్మశాస్త్రమును గైకొనవలసినదని ఆయన కాలములో సజీవులై యుండిన ఇతరులకు ఉపదేశించాడు (19:16–22; లూకా 10:25–28).

ఈ వచనములో, ధర్మశాస్త్రము గూర్చి ఆయన చేసిన ఉపదేశములను అర్థంచేసికొనుటలో దొర్లిన అపార్థములను సరిదిద్దుటకు యేసు ప్రయత్నించుచుండెను. యూదీయ బోధకుల సాంప్రదాయములకు వ్యతిరేకముగా బహిరంగముగా మాటలాడుచు వాటిని నైతిక నిష్ఠతో పాటించుటకైనా ప్రయత్నించలేదు గనుక, ఆయన ధర్మశాస్త్రమును కొట్టివేయుటకే ప్రయత్నించుచున్నవాడని యూదీయ నాయకుల చేత చిత్రీకరింపబడినాడు

(15:1–9 చూడము). నిశ్చయముగా, ఆయన ఉద్దేశము అది కానే కాదు. దానికి బదులుగా, దేవుని కట్టడలు వాటి మూల పవిత్రత ప్రకారము పాటింపబడుటను పునరుద్ధరించవలననే ఆయన ఆశించాడు (19:1–9).

**నేను వచ్చితిని** అను మాటల ద్వారా, యేసు ఎంతో కాలంగా ఎదురుచూడబడుచుండిన మెస్సీయాతో తనను తాను గుర్తించుకొన్నాడు. "వచ్చుచున్నవాడు" అను పదజాలము మెస్సీయాకు సంబంధించిన ఒక అభివ్యక్తమై యుండినది (కీర్తనలు 118:26; మలాకీ 3:1; మత్తయి 11:2, 3; 21:9; యోహాను 4:25 చూడుము). మెస్సీయాయే ధర్మశాస్త్రమునకు నిజమైన మరియు అంతిమ అనువాదకుడై యుండుననునది ప్రబలియుండిన దృష్టికోణమై యుండినది.

యూదులు పాత నిబంధనను మనము సామాన్యంగా విభజించు విధానము కంటె భిన్నంగా విభజించారు. మనము దానిని నాలుగు విభాగములుగా విభజించుదుము (ధర్మశాస్త్రము, చరిత్ర, పద్యము మరియు ప్రవచనము), అయితే హెబ్రీ బైబిల్ మూడు విభాగములు మాత్రమే కలవు (ధర్మశాస్త్రము, ప్రవక్తలు మరియు వచనములు; లూకా 24:44 చూడుము). తరుచుగా పాత నిబంధన అంతా కలిపి "ధర్మశాస్త్రము మరియు ప్రవక్తలు" అని చెప్పుకొనబడినది (7:12; 11:13; 22:40; అపొస్తలుల కార్యములు 13:15; 28:23; రోమీయులకు 3:21).

**"నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు"** యేసు ధర్మశాస్త్రమును "కొట్టివేయుటకు" లేక "నాశనము చేయుటకు" రాలేదు, సరికదా ఆయన దానిని "నెరవేర్చుటకే" లేక "పూర్తిచేయుటకే" వచ్చాడు. "కొట్టివేయుటకు" అని అర్థమిచ్చునట్లు ఆయన ఉపయోగించిన గ్రీకు పదమునకు "నాశనము చేయుట" "రద్దుచేయుట" లేక "న్యాయసమ్మతముకానిదానిగా చేయుట" అని అర్థము. "నెరవేర్చుట" అని అర్థమిచ్చు గ్రీకు పదమునకు "సంపూర్ణము చేయుట," "పూర్తిగావించుట," లేక "ముగించుట" అని అర్థము. ధర్మశాస్త్రమును కొట్టివేయుటకు బదులుగా, యేసు దాని ఉద్దేశమును నెరవేర్చాడు గనుక తత్ఫలితంగా ఆయన సిలువ మీద మరణించినప్పుడు దానిని మనకు అడ్డములేకుండ ఎత్తివేసాడు (రోమీయులకు 10:4; ఎఫెసీయులకు 2:15). ఆ సమయంలో ధర్మశాస్త్రము "మృతమైనదయ్యింది," గనుక యిక మీదట దానిని గైకొనవలెనను నిర్బంధము తొలగిపొయినట్లే (రోమీయులుకు 7:4; గలతీయులకు 3:25; 5:1–4). ఆయన పునరుత్థానుడైన తరువాత, ఆయన ధర్మశాస్త్రమంతటిని "నెరవేర్చాడని" యేసు తన శిష్యులకు తెలియజెప్పెను (లూకా 24:44). యేసు గైకొనని భాగము ధర్మశాస్త్రములో ఏదియును లేదు, మరియు మెస్సీయకు సంబంధించిన నెరవేరని పాత నిబంధన ప్రవచనములేవియును లేవు. ధర్మశాస్త్రము లేక ధర్మశాస్త్రములో ఏ భాగమైనను గైకొనబడవలసినదేనని ఈ నాడు ఎవరైనా పట్టుబట్టినట్లయితే వారు దేవుని ప్రణాళికలో లేని పద్ధతిని అంటిపట్టుకొని వ్రేలాడుచున్నవారౌదురు.

### "ఒక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదు" (5:18)

**18ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని, ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

**వచనము 18. “నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని”** పలుకుచు యేసు తన తరువాతి నిశ్చయవాక్కులను ప్రస్తావించాడు. మనము ఆంగ్లములోను తెలుగులోను “ఆమేన్” అని పలుకుచుండు పదము వెనుక “నిశ్చయముగా” అని అర్థమిచ్చు గ్రీకు పదమున్నది. గంభీరమైన ఈ వ్యక్తీకరణమును ఆయన చేసిన ప్రకటనల అంతములో కంటే ఆరంభంలోనే యేసు విశిష్టముగా ప్రయోగించాడు. దేవుని చిత్తమును యేసు సాధికారంతో నివేదించుచు ఆయన పలికిన “నేను మీతో చెప్పుచున్నాను” అను మాటలు ఈ అధ్యాయమందంతటను పునరుక్తమగుచుండును (5:20, 22, 26, 28, 32, 34, 39, 44).

**“ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని”** యేసు చెప్పాడు.[2] “ఒక సున్నయైనను” (KJV) గ్రీకులో అక్షరాలా “ఒక అక్షరమై” యున్నది. “Iota” “అయోట” గ్రీకు అక్షరమాలలో అత్యంత చిన్న అక్షరమై యున్నది. హెబ్రీ భాషలో, ధర్మశాస్త్రము రచింపబడిన మూల భాషలో, అత్యంత చిన్న అక్షరము “యూద్,” “పొల్లు” లేక “సున్న” (KJV) అనునది “కొమ్ము” అని నిర్దిష్ట అర్థమిచ్చు ఒక గ్రీకు పదము నుండి ఉత్పన్నమగుచున్నది. ఒక హెబ్రీ అక్షరమును మరొక హెబ్రీ అక్షరము నుండి విలక్షణముగా గుర్తించునట్లు దాని మీద నుండు అత్యల్పమైన గుర్తును అది సూచించుచున్నది. ఆంగ్లములో, చిన్న “ఐ” మీద మనము పెట్టు బిందువు మరియు చిన్న “టి” కి అడ్డముగా రాయు గీత వంటిదై యున్నదని ఇదే సూత్రము గూర్చి సోదాహరణ ంగా చెప్పుకొనవచ్చును. మినహాయింపేదియును లేకుండా, ప్రతి ప్రవచనము, సంకేతము, మరియు వాగ్దానము నెరవేర్చబడును. ఆ నెరవేర్పు క్రీస్తు చేత సిలువ మీద సంపూర్తిగా సాధింపబడువరకు, ధర్మశాస్త్రము ఒకడు కట్టుబడి యుండవలసిన విషయమై యుండినది గనుక ఆ కాలములోని యూదులు ధర్మశాస్త్రములోని ప్రతి భాగమును గైకొనుట వారికి అనివార్యమైనదై యుండినది.

మనమిప్పుడు ఒక నూతన నియమము, “క్రీస్తు నియమము” (గలతీయులకు 6:2) క్రింద జీవించుచున్నాము. ఇదివరకు ఆయన ఇచ్చిన పాత నియమము ప్రకారము మనము జీవించవలెనని దేవుడు కోరుట లేదు. యేసు క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన లోనికి న్యాయసమ్మతముగా చేర్చబడియున్న దానిలోని సూత్రములను మనము గైకొనుచుండవలెను; అయితే అవి పాత నిబంధనలో బయలు పరచబడినవని కాదు, కానీ అవి క్రొత్త నిబంధనలో ఉన్నవి గనుక మనము లోబడుచున్నాము. “ఇట్లుండగా ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలుపడుచున్నది, దానికి ధర్మశాస్త్రమును ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు, అది యేసు క్రీస్తునందలి విశ్వాస మూలమైనదై, నమ్మువారందరికి కలుగు దేవుని నీతియై యున్నదని” పౌలు రచించాడు (రోమీయులకు 3:21, 22). నాలుగు సువార్తల్లో కూడ 120 పర్యాయములు కంటె ఎక్కువ యేసు, “నేను మీతో చెప్పుచున్నాను” (KJV) అని పలికిన మాటలు రచింపబడి యున్నవి. ఆయన, “నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్య దినమందు వానికి తీర్పు తీర్చునని” ఘోషించాడు (యోహాను 12:48). “ఆకాశమును భూమియు గతించును, గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవని” కూడ ఆయన చెప్పాడు (మత్తయి 24:35).

## "యీ యాజ్ఞలలో మిగుల అల్పమైన" యొకదానినైనను (5:19)

**[19]కాబట్టి యీ యాజ్ఞలలో మిగుల అల్పమైన యొకదానినైనను మీరి, మనుష్యులకు ఆలాగున చేయ బోధించువాడెవడో, వాడు పరలోక రాజ్యములో మిగుల అల్పుడనబడును; అయితే, వాటిని గైకొని బోధించువాడెవడో, వాడు పరలోకరాజ్యములో గొప్పవాడనబడును.**

**వచనము 19.** శాస్త్రులు మరియు పరిసయ్యులు ధర్మశాస్త్రమును పెద్దవి మరియు చిన్నవి అను భాగములుగా విభాగించుచు, కొన్ని కట్టడలు ఇతర కట్టడల కంటె ఎక్కువ ముఖ్యమైనవని అనువదించారు. ఈ రెండింటిని జాక్. పి. లూయిస్ ఈ క్రింది విధంగా పోల్చాడు:

> యూదుల బోధకులు ధర్మశాస్త్రములో 613 ఆజ్ఞలు లెక్కించారు గనుక తల్లిని తండ్రిని సన్మానించుమను ఆజ్ఞను (నిర్గమకాండము 20:12 ద్వితీయోపదేశకాండము 5:16) ఒక భారీ ఆజ్ఞగా పరిగణించారు, అయితే పక్షుల గూళ్లతో వ్యవహరించుట గూర్చి ద్వితీయోపదేశకాండము 22:6లో గల ఆజ్ఞను అత్యంత తేలికైన ఆజ్ఞగా లెక్కించారు. ఏది ఏమైనా, ఆజ్ఞలలో ఏ ఆజ్ఞయైనను అలక్ష్యము చేయతగినది కాదు.[3]

మిష్నా ఇలా సెలవిచ్చుచున్నది,

> మత సంబంధమైన పెద్ద విధులకు వలెనే చిన్న విధులకు సహితము తగిన ప్రాముఖ్యత నిచ్చుటకు అతి జాగ్రత్తపరులై యుండుడి, ఏలయనగా మతసంబంధమైన నానా విధులలో ఏ విధికి ఎటువంటి బహుమానము ఇవ్వబడనై యున్నదో మీరెరుగరు ... మతసంబంధమైన అత్యంత ముఖ్యమైన విధులకు వలెనే చిన్న చిన్న విధులను నిర్వర్తించుటకును పాటుపడుచు, అతిక్రమముల నుండి ఆమడ దూరము పారిపోండి. ఏలయనగా మతసంబంధమైన ఒక విధిని నిర్వహించుట మరొక విధిని కూడ నిర్వహింపవలెనని పిలుపు ఇవ్వబడుచున్నది.[4]

యీ యాజ్ఞలలో మిగుల అల్పమైన యొకదానినైనను అని పలికినప్పుడు యేసు సర్దుబాటు నిమిత్తము వసతి కల్పించెడు భాషను ప్రయోగించుచుండెనా? శాస్త్రులు మరియు పరిసయ్యులు కొన్ని నియమములు ఇతర నియమముల కంటె ఎక్కువ ముఖ్యమైనవని ఎంచుచుండిరి గనుక, ఇతర నియమముల కంటె అవి "అల్పమైనవని" వారు ఎంచినవి సహితము అలక్ష్యము చేయతగినవని ఆయన చెప్పుచుండెనా? బహుశా చెప్పుచుండలేదు. ఆజ్ఞలన్నిటిలో అతి గొప్పదను ఆజ్ఞను ("నీ దేవుడైన యెహోవాను ప్రేమించుము"), మరియు దానితోపాటే రెండవ ఆజ్ఞను ("నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించుము") యేసు తానే గుర్తించాడని జ్ఞాపకముంచుకొనవలెను (22:34–40). శాస్త్రులు మరియు పరిసయ్యులు వారి దృష్టిని తేలికైన ఆజ్ఞలపైనే ("పుదీనాలోను సోపులోను జీలకఱ్ఱలోను పదియవ వంతు చెల్లించుటపై") కేంద్రీకరించుచు, ప్రధానమైన ఆజ్ఞలను (న్యాయమును, కనికరమును, మరియు విశ్వాసమును) అలక్ష్యము చేయుచుండిరని కూడ యేసు సెలవిచ్చాడు. వారు ఈ రెండు విధములైన ఆజ్ఞలకు లోబడవలసి యుండినదని ఆయన ప్రకటించాడు (23:23).

వారు **పరలోక రాజ్యములో మిగుల అల్పుడనబడుదురని** ఆయన చేసిన ఉపదేశమునుబట్టి చూచినట్లయితే, మోషే ధర్మశాస్త్రమును గైకొనని క్రైస్తవులు పొరబడుచున్నారనునది దాని అర్థము కాదు. దాని కంటే, దేవునికి లోబడుటలో గల ప్రాముఖ్యతను నొక్కివక్కాణించుటకు ఆయన ఒక సమాంతరత్వమును ప్రయోగించుచుండెను. యేసు ధర్మశాస్త్రమును నెరవేర్చిన

దాని దృష్ట్యా ఆయన తెలియజెప్పుచుండిన విషయాన్ని అర్థంచేసికొనవలెను. లేఖనములకు విధేయతతో లోబడుట అనగా క్రీస్తు నియమమునకు లోబడుటయే అని అర్థము.

### "శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల ..." (5:20)

**[20]శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల, మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను.**

**వచనము 20.** ఒక విశాలమైన పరిధిలో యేసు, **"శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల, మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నానని"** పలికాడు. ఆయన శిష్యులు "పరలోక రాజ్యములో ప్రవేశించునట్లు వారు క్రీస్తు నియమములకు యాంత్రికంగా లోబడుటను మించిన విధేయతను ప్రదర్శింపవలసి యున్నదని" ఆయన నొక్కివక్కాణించుచుండెననుటలో ఎటువంటి సందేహము లేదు.[5] "శాస్త్రులు మరియు పరిసయ్యుల" నీతి, మతసంబంధమైనవై బాహ్యమునకు బలమైనవిగా అగుపించు ఆచారకర్మలను వారు గైకొనుచుండినంత కాలము దైవభక్తిశూన్యమైన అనుభూతులకు వారి హృదయములలో ఆశ్రయము కల్పింపబడునట్లు అనుమతించుచుండినది. ఇది దేవుని నియమము విషయంలో ఒక అర్థరహితమైన అవినీతియై యుండినది. యేసు అనుచరులు, అసంఖ్యాకమైన బాహ్యాచారములను అనుసరించుచుందురు కాబట్టి, హృదయాలోచన గూర్చి ఆందోళన చెందనవసరములేదను తుది అభిప్రాయమునకు రాకూడదు. ఒక గిన్నె యొక్క లోపలి భాగమును అసహ్యమైన మురికితోనే వదిలిపెట్టి దాని వెలుపలి భాగమును మాత్రమే శుభ్రము చేయుట వారికెటువంటి ప్రయోజనమునైనను సమకూర్చదని యేసు శాస్త్రులతోను పరిసయ్యులతోను అటుతరువాత చెప్పాడు (23:26).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### యేసు మరియు ధర్మశాస్త్రము (5:17-20)

యేసు మోషే ధర్మశాస్త్రమును "కొట్టివేయుటకు" రాలేదు, కానీ దానిని "నెరవేర్చుటకే" వచ్చాడు. యూదులు, నానావిధములైన వారి అనువాదములు, చేర్పులు, మరియు తొలిగింపుల ద్వారా తీసివేసిన ధర్మశాస్త్రము యొక్క గౌరవప్రదమైన ఘనతను మరియు దాని పరపతిని పునరుద్ధరించుటకు ఆయన వచ్చాడు. ఆయన నూతన యుగము – క్రైస్తవ యుగము కొరకైన నిబంధనను వ్యవస్థాపించుచుండెనని కూడ ఆయన చేసిన వ్యాఖ్యానము ద్వారా విధితమగుచున్నది. దేవుడు అంతకు మునుపటి రెండు దైవవిధానముల నిమిత్తము అనుగ్రహించిన నిత్య సూత్రములలోని అనేకమైన వాటిని యేసు క్రొత్త నిబంధన లోపల మిళితము చేసాడు. అవి పాత నిబంధనలో భాగమై యున్నవని కాదు, కానీ వీటిని ఆయన మనకిచ్చాడు గనుక మనము వీటిని గైకొనవలసి యున్నది (హెబ్రీయులకు 8:7-13 చూడుము).

## సూచనలు

[1]ఏది ఏమైనా, ఈ తీర్మానము తీసికొనబడునప్పుడెల్లా సందర్భము దృష్టిలో ఉంచుకొనబడవలెను. [2]లూకా 16:17 చూడుము. యూదుల బోధకుల రచనలలో ఇటువంటి భాషయే ప్రయోగింపబడినది. "ధర్మశాస్త్రములో నుండి ఒక పొల్లయినను శాశ్వతముగా కొట్టివేయబడదని," *Exodus Rabbah* 6.1 చెప్పుచున్నది. [3]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 87. [4]Mishnah *Aboth* 2.1; 4.2. [5]Lewis, 88.